సాక్షి
అనంతపురం
శుక్రవారం । 3 । మార్చి । 2023



టన్ను చీనీ రూ.33 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20
అనంతపురంలోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.3°/ 15.2°
జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తగ్గుముఖం పట్టింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పుష్కలంగా నీరు
- తాగునీటి ప్రాజెక్టులకు నీటి కొరత ఉండదు
- ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి


పీఏబీఆర్‌లో నీటి మట్టం

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ జలాశయం వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, అనంత, శ్రీరామరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు వేసవిలో నీటి కొరత ఉండదని ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలో నీరు పుష్కలంగా ఉందన్నారు. తాగునీటి ప్రాజెక్టులకు 1.5 టీఎంసీలు నిల్వ ఉంటే చాలని, అయితే, గురువారం నాటికి 4.7 టీఎంసీలు ఉందని పేర్కొన్నారు. ఇంతకు ముందు హెచ్చెల్సీ ద్వారా తుంగభద్ర జలాలు, హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా కృష్ణా జలాలు వచ్చి డ్యాంలోకి చేరేవన్నారు. డ్యాంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్రాజెక్టులకు, ధర్మవరం కుడికాలువకు కలిపి రోజుకు 223 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు.

ప్రాక్టికల్స్‌కు 64 మంది గైర్హాజరు
రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలకు 64 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 45 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1,729 మంది విద్యార్థులకు గానూ, 1691 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 43 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 1,623 మందికి 1,597 మంది హాజరయ్యారు. జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వెంకటరమణ నాయక్, శ్రీ సత్యసాయి జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డి, ఆర్ఐఓ సురేష్‌బాబు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హైపవర్ కమిటీ మెంబరు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు ఉమ్మడి జిల్లాలో వివిధ కేంద్రాలను తనిఖీ చేశారు.

'బెంగళూరు-కాచిగూడ' ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: శ్రీ విశ్వేశ్వరాయ టెర్మినల్ బెంగళూరు-కాచిగూడ మధ్య ఈ నెల 4,6 తేదీల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 3,5వ తేదీల్లో శ్రీ విశ్వేశ్వరాయ టెర్మినల్ బెంగళూరు (06523) నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, మంత్రాలయరోడ్డు, రాయచూర్, గద్వాల, వనపర్తి రోడ్డు, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, కాచిగూడ జంక్షన్‌కు మరుసటి రోజు ఉదయం 5.20 గంటలకు చేరుకుంటుదన్నారు. తిరుగు ప్రయాణంలో కాచిగూడ జంక్షన్ (06524) నుంచి 4,6వ తేదీల్లో మాత్రమే రాత్రి 10.55కు బయలుదేరి బెంగళూరుకు ఉదయం 11.45 గంటలకు చేరుతుందన్నారు.

ఆడిట్ వివరాలు పక్కాగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రసవం ఆడిట్ వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం గైనకాలజిస్ట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో సిజేరియన్ సెక్షన్ ఆడిట్‌కు సంబంధించిన వివరాలను ప్రసవం జరిగిన 48 గంటల్లోపు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆడిట్ ప్రొఫార్మా పూర్తి స్థాయిలో నింపాలన్నారు. లింగ నిర్ధారణకు సంబంధించి పోస్టర్లను తప్పనిసరిగా ప్రతి ఆసుపత్రిలో ఉంచాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యుగంధర్, డాక్టర్ సుజాత, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు, మారుతిప్రసాద్, ఐడీఎస్పీ వేణుగోపాల్, వైద్యులు జైతున్‌రుమాన్ తదితరులున్నారు.

రౌడీషీటర్లపై ఖాకీ కన్ను


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

- ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- అసాంఘిక శక్తులపై పోలీసుల దృష్టి
- రౌడీషీటర్లపై నిఘా
- టీడీపీ హయాంలో ప్రత్యర్థులపై భారీగా రౌడీషీట్లు
- జిల్లాలోనే అత్యధికంగా తాడిపత్రి సబ్‌డివిజన్‌లో నమోదు
- ప్రత్యర్థులపై కక్షతో ఓపెన్ చేయించిన జేసీ సోదరులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో రౌడీషీటర్లపై మళ్లీ నిఘా పెడుతున్నారు. వారం రోజుల్లో పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పాటు ఏడాదిలో సాధారణ ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలని పోలీసు వర్గాలు నిర్ణయించాయి. గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న రౌడీషీటర్లు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ గొడవలు సృష్టించే అవకాశం ఉంటుందన్న అనుమానంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, జిల్లాలో 45 ప్రాంతాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా చోట్ల పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

2 వేలకు పైగా రౌడీషీట్లు..
జిల్లాలో గత కొన్నేళ్లుగా నమోదైన రౌడీషీట్లు ఎక్కువగానే ఉన్నాయి. ముఖ్యంగా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా వ్యవహరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులూ, అంతెందుకూ తమ మాట వినని ఎవరిపైన అయినా ఇట్టే రౌడీ షీట్ ఓపెన య్యేది. పోలీసులు మాట వినకపోతే వారిపై తెలుగుదేశం పార్టీనేతలు తీవ్ర ఒత్తిడి తెచ్చి మరీ రౌడీషీట్ ఓపెన్ చేసేవారని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు.

తాడిపత్రిలో అత్యధికంగా..
జిల్లాలో తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలో ఎక్కువ రౌడీషీట్లు నమోదైఉన్నాయి. ఇక్కడ అత్యధికంగా 759 మందిపై రౌడీషీట్ తెరిచారు. టీడీపీ హయాంలో జేసీ సోదరులు, వారి అనుచరుల ఆగడాలు అందరికీ తెలిసిందే. తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటికీ పరిస్థితి అలాగే ఉంది.

మట్కా కలెక్షన్ ఇవ్వకపోయినా రౌడీషీట్
2014–19 మధ్య కాలంలో తాడిపత్రి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో వందల రౌడీషీట్‌లు నమోదయ్యాయి. జేసీ ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టినా రౌడీషీట్ నమోదయ్యేదని అక్కడి పోలీసులు చెబుతున్నారు. అంతెందుకూ మట్కా ఆడేవారిపై రౌడీషీట్ నమోదు చేయించడం, వారం వారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సిఫార్సు చేసినందుకు కలెక్షన్ ఇవ్వమనడం ఇదీ పరిస్థితి. తమకు నచ్చని వందల మందిపై జేసీ సోదరులు రౌడీషీట్ ఓపెన్ చేసేవారని ఓ నాయకుడు పేర్కొన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో జేసీ సోదరులకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లందరిపైనా రౌడీషీట్ నమోదై ఉందంటే ప్రభాకర్ రెడ్డి సోదరుల వ్యవహారం ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు.

జిల్లాలో సబ్‌డివిజన్ల వారీగా రౌడీషీట్‌లు	
తాడిపత్రి	759
అనంతపురం	732
కళ్యాణదుర్గం	241
గుంతకల్లు	517
మొత్తం	2,249

అవసరమైతే బైండోవర్
రౌడీషీట్‌లు ఉన్న వారిపై నిఘా ఉంచాం. కొంత కాలంగా వారి ప్రవర్తనను బట్టి తగిన చర్యలు తీసుకుంటాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని భావిస్తే బైండోవర్ చేస్తాం. ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తాం.
– చైతన్య, డీఎస్పీ, తాడిపత్రి

రౌడీషీట్ ఎందుకు ఓపెన్ చేస్తారంటే?
హత్యాహత్నం కేసు నమోదు లేదా హత్య కేసు ఉన్నప్పుడు..శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన కేసులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి కేసుల్లో ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్నప్పుడు రౌడీషీట్ ఓపెన్ చేసి అతనిపై నిఘా ఉంచుతారు. వారానికోసారి పోలీస్ స్టేషన్ కొచ్చి కనిపించి వెళ్లాల్సి ఉంటుంది.

ఇలా తీసేస్తారు..
ఒక్కసారి రౌడీషీట్ నమోదు చేశారంటే కనీసం రెండేళ్ల పరిశీలనలో ఉంచుతారు. ఆ రెండేళ్లలో అతనిపై ఎలాంటి కేసులు నమోదు కాకుండా, సత్ప్రవర్తన వచ్చిందని రుజువైతే రౌడీషీట్ క్లోజ్ చేస్తారు. ఏడాదికోసారి రౌడీషీటర్లపై సమీక్ష జరుగుతుంది. అతనిలో మార్పు వచ్చిందని ఎస్‌డీపీఓ (సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్) సర్టిఫికెట్ ఇస్తే రౌడీషీట్ మూసేస్తారు.

కాకపోతే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రౌడీషీట్‌ల నమోదు భారీగా తగ్గింది.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి


మాట్లాడుతున్న డీడీ కుష్బూ కొఠారి

అనంతపురం రూరల్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి పేర్కొన్నారు. గురువారం నగరంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ట్యూటర్లు ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా తరగతులు తీసుకోవాలన్నారు. సిబ్బంది విధుల పట్ల చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, వార్డెన్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక 94.54 శాతం పంపిణీ
అనంతపురం సెంట్రల్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ శరవేగంగా సాగుతోంది. 2,76,640 మందికి పింఛన్ మంజూరు కాగా గురువారం సాయంత్రం నాటికి 2,61,547 మందికి పెన్షన్ డబ్బు అందించి 94.54 శాతం మేర పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 90 శాతం పైగా పూర్తవడం గమనార్హం. ఇందులో అత్యధికంగా తాడిపత్రి అర్బన్ 97.31 శాతం, బుక్కరాయసముద్రం–97.12, నార్పల–96.50, పామిడి అర్బన్–96.29, పెద్దవడుగూరు–96.25 శాతం మేర పంపిణీ చేశారు.

విద్యార్థుల్ని తీర్చిదిద్దేవారే నిర్లక్ష్యం చేస్తే ఎలా?

- అలాంటి టీచర్లను దూర ప్రాంతాలకు బదిలీ చేయండి
- డీఈఓకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశం


అనంతపురం డీఈఓతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుతర బాధ్యతను కొందరు ఉపాధ్యాయులు విస్మరిస్తుండడం బాధాకరమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ, ప్రైవేటు పనుల్లో మునిగితేలుతున్న టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు– 1, 2, 4, 7వ (ప్రణాళిక, ఆర్థిక/గ్రామీణాభివృద్ధి/విద్య,వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు స్థానిక జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనులపై సమీక్షతో పాటు సమస్యలను మాత్రమే ప్రస్తావించాలని, ఎటువంటి ప్రతిపాదనలు, బడ్జెట్ ప్రకటించడానికి వీల్లేదని సీఈఓ భాస్కర్‌రెడ్డి సభ్యులకు వివరించారు. ఆ తరువాత సమావేశం కొనసాగింది. బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ..బుక్కరాయసముద్రం హైస్కూల్‌లో పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం మాత్రమే బయోమెట్రిక్ హాజరుకు వస్తున్నారని, ఆ తరువాత అనంతపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటూ పిల్లలను గాలికొదిలేశారని ఆరోపించారు. గోరంట్ల మండలంలో ఎంఈఓ మండల సమావేశాలకు రావడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే చాలా మంది ఉపాధ్యాయులు నిత్యం జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తరచూ పాఠశాలలు ఎగ్గొడుతున్న వారిని గుర్తించి మెమోలు ఇవ్వాలని, అయినా మారకుంటే దూర ప్రాంతాలకు బదిలీ చేయాలని డీఈఓ సాయిరాంను ఆమె ఆదేశించారు.

పనులు ప్రారంభించకుంటే రద్దు..
జెడ్పీటీసీ సభ్యులకు గతంలో రూ.20 లక్షలు, రూ.30 లక్షల చొప్పున పనులు కేటాయించామని, వాటిని చాలా మంది ఇంకా ప్రారంభించలేదనే ఫిర్యాదులు ఉన్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ప్రారంభించని పనులు రద్దు చేసి, ఇతర ప్రాంతాలకు కేటాయించాలని పంచాయతీరాజ్ ఈఈ రవీంద్రను ఆమె ఆదేశించారు. అవసరమైన చోట్ల 108 అంబులెన్స్‌లకు మరమ్మతులు చేయించాలని సూచించారు.

అంగన్‌వాడీలకు నాసిరకం సరుకులా?
రాయదుర్గం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం సరుకులు పంపిణీ చేస్తున్నారని స్థాయీ సంఘం–5 అధ్యక్షురాలు హెచ్.హసీనా అధికారుల దృష్టికి తెచ్చారు. జెడ్పీలోని అదనపు సమావేశ భవన్‌లో ఆమె అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా పలువురు సభ్యులు మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అపరిశుభ్రంగా తయారయ్యాయన్నారు. కొందరు సీడీపీఓలు ప్రజాప్రతినిధుల ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదని, ఇంత నిర్లక్ష్యమైతే ఎలాగని నిలదీశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆ శాఖ పీడీ డాక్టర్ బీఎస్ శ్రీదేవి, శ్రీసత్యసాయి జిల్లా పీడీ లక్ష్మీకుమారి తెలిపారు.

- సాంఘిక సంక్షేమ శాఖలపై నిర్వహించిన సమావేశానికి నార్పల జెడ్పీటీసీ సభ్యురాలు వి.నాగరత్నమ్మ అధ్యక్షత వహించారు. ఆయా స్థాయీ సంఘాల సభ్యులు హాజరై అనేక అంశాలపై చర్చించి, అధికారుల నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జిల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు


టేబుళ్ల ఏర్పాటుపై సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు పకడ్బందీగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయనున్న జేఎన్‌టీయూ కళాశాలను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవితో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపునకు గదులు, వసతుల కల్పన, బ్యారికేడింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎనికలకు సంబంధించిన సామాగ్రి పంపిణీ, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు గదుల్లో కంచె ఏర్పాటు, వాహనాల పార్కింగ్ పనులు ప్రణాళికబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.

పటిష్ట బందోబస్తు ఉండాలి
ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు, బందోబస్తు పటిష్టంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 49 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, బ్యాలెట్ పేపర్ పెద్దగా ఉంటుందన్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకుని ట్రేల పరిమాణం, టేబుళ్ల ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు సీటింగ్ పరిగణనలోకి తీసుకుని, సరిపడేలా స్థలం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. బందోబస్తు, కౌంటింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు, భోజన వసతి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మధుసూదన్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సుజాత, నగరపాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం

- అభ్యర్థుల విజయంలో భాగస్వాములు కండి
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు 'పైలా' పిలుపు



అనంతపురం క్రైం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం ఐకమత్యంతో ముందుకెళ్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఓటరును కలసి ప్రభుత్వం చేసిన మంచిని తెలియజేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రా రెడ్డి విజయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. ప్రాధాన్యత ఓటును వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేయించాన్నారు. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పట్టం కట్టిన విషయాన్ని తెలియజేయాలన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 15 సీట్లను బడుగు వర్గాలకే కేటాయించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. మంత్రి వర్గంలో, రాజ్యసభ సీట్ల కేటాయింపులో బీసీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకుని సీఎం రుణం తీర్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

సింహవాహనంపై చెన్నకేశవుడి వైభవం

యాడికి: మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేత శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం పరిసర ప్రాంతం కిక్కిరిసిపోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.



చెన్నకేశవస్వామి గ్రామోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) సింహవాహనంపై స్వామివారు

ఖాద్రీశుడి ఉత్సవాలకు అంకురార్పణ


యాగశాలలో కొలువుదీరిన లక్ష్మీనారసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా అంకురార్పణ జరిగింది. మంగళ వాయిద్యాల మధ్య నారసింహుడిని రాత్రి 9.45 గంటల ప్రాంతంలో ఆలయానికి నైరుతి దిశలో ఉన్న మండపాన్ని చేర్చారు. అర్చక పండితులు భూమి పూజతో పుట్ట మన్ను సేకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. యాగశాలలో ఆ మట్టితో నింపిన 9 పాలిక (కుండ)లలో నవ ధాన్యాలతో అంకురార్పణ (బీజావాపం) చేశారు. ఈ నవధాన్యాలు దిన దినాభివృద్ధి చెందేలా అర్చకులు బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకూ రోజూ నీరు పోసి మొలకెత్తేలా చూస్తారు. ఏ ధాన్యం బాగా మొలకెత్తుతుందో ఆ పంట ఈ ఏడాది బాగా పండుతుందని భక్తుల నమ్మకం. ఈ పక్షం రోజుల పాటు స్వామివారు యాగశాల నుంచే భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

నేడు కళ్యాణోత్సవం
బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కళ్యాణోత్సవం కమనీయంగా సాగనుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్లుప్తంగా

జిల్లా హాకీ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎంపికైన కార్యవర్గ సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఎన్నుకున్నారు. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియలో పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా మారుతీప్రసాద్, షేక్ మహబూబ్ బాషా, జాయింట్ సెక్రటరీగా చక్రపాణి యాదవ్, ట్రెజరర్‌గా పరమేష్, ఈసీ సభ్యులుగా మోహన్, కుళ్లాయప్ప, గౌతం, పరమేశ్వర్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడి ఎన్నిక త్వరలో ఉంటుందని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

ప్రాణాలు కాపాడిన '100'



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆపదలో కొందరు... కష్టాల్లో మరి కొందరు... జీవితంపై విరక్తితో ఇంకొందరు... ఇలా కష్టమేదైనా అనంత పోలీసుపై జిల్లా వాసులు నమ్మకం ఉంచారు. ఆపన్న హస్తం అందిస్తారన్న ఆశతో విపత్కర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేసి కష్టాలు చెప్పుకున్నారు. దీంతో గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడిన 16 మంది క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు దోహదపడింది. మరో ఆరుగురిని ఆత్మహత్యాయత్నం నుంచి పోలీసులు కాపాడారు. అమాయకులపై దాడులు, అమ్మాయిల పట్ల అసభ్య ప్రవర్తన, ఈవ్ టీజింగ్ అంశాలకు సంబంధించి 28 కేసులు నమోదు చేశారు. ఓ బాల్య వివాహాన్ని ఆపి చిన్నారికి బాసటగా నిలిచారు. ఉచిత రేషన్ బియ్యం నల్లబజారుకు తరలిపోకుండా సమర్థవంతంగా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప మాట్లాడుతూ.. డయల్ 100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. అపత్కాలంలోనే కాకుండా అసాంఘిక శక్తుల గురించి సమాచారం అందించి సమాజ శ్రేయస్సుకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

పదిలో టాప్.. అనంత సంకల్పం

- ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లాలో 313 ప్రభుత్వ పాఠశాలల్లో 17,297 మంది పదో తరగతి విద్యార్థులు
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అడుగులు
- సత్ఫలితాలిస్తున్న రౌండు టెస్టులు
- రౌండు రౌండులోనూ పెరుగుతున్న మెరుగుదల

రౌండు టెస్టుల ఫలితాలు ఇలా...

రౌండ్	ఫలితం (శాతం)
మొదటి	61.65
రెండు	65.59
మూడు	67.78
నాలుగు	69.28
ఐదు	69.12

మరో మూడు రౌండ్ల పరీక్షలు జరగనున్నాయి


స్టడీ అవర్స్‌లో భాగంగా బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

రాప్తాడు రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా అనంత సంకల్పం కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ పటిష్టంగా అమలు చేస్తోంది. కరోనా కారణంగా విద్యార్థులు దాదాపు రెండేళ్ల పాటు ప్రత్యక్ష బోధనకు దూరమయ్యారు. ఫలితంగా 2021–22 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా 49.70 శాతం ఉత్తీర్ణతతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అక్షర క్రమంలోనే కాకుండా పదో తరగతి పరీక్ష ఫలితాల్లోనూ అనంతను అగ్రస్థానంలో నిలిపేందుకు అవసరమైన కార్యాచరణతో జిల్లా విద్యాశాఖ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 'అనంత సంకల్పం' 100 రోజుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 313 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ, ఏపీ మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 17,297 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు.

రౌండు టెస్టులతో పురోగతి

గత ఏడాది డిసెంబరు 14 నుంచి ప్రారంభమైన 'అనంత సంకల్పం' ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీ వరకూ కొనసాగనుంది. రోజు వారీ రెగ్యులర్ టైంటేబుల్‌కు ఆటంకం లేకుండా ఉదయం, సాయంత్రం, సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు మొత్తం 8 రౌండ్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఐదు రౌండ్ల పరీక్షలు పూర్తయ్యాయి. ప్రతి రౌండులోనూ 20 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో 7 మార్కులు ఉత్తీర్ణతగా నిర్ణయించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చిత్తశుద్ధితో అమలు చేస్తుండడంతో ఆశించిన మేర ఫలితాలు వస్తున్నాయి. ప్రతి రౌండ్‌లోనూ విద్యార్థులు అనూహ్యమైన ప్రగతిని సాధిస్తూ దూసుకెళుతున్నారు.

'అనంత సంకల్పం' అమలు ఇలా...

రోజూ సాయంత్రం ఒక సబ్జెక్టుపై పర్యవేక్షణ స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. మరుసటి రోజు ఉదయం అదే సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష ఉంటుంది. ఉపాధ్యాయులే 20 మార్కులకు ప్రశ్నపత్రం రూపొందిస్తారు. ప్రతి సబ్జెక్టుకు రెండేసి సెలవు దినాలు ఉంటాయి. మొదటి సెలవు దినంలో భాషోపాధ్యాయులు గ్రామరు, గణితోపాధ్యాయులు గ్రాఫులు, సైన్స్ ఉపాధ్యాయులు బొమ్మలు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మ్యాపులు ప్రాక్టీసు చేయిస్తారు. రెండో సెలవు దినం రోజు డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ఆధ్వర్యంలో రూపొందించిన నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహించి, విద్యార్థుల నైపుణ్యాలను గుర్తిస్తారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి ప్రగతికి టీచర్లు, ఏ గ్రేడ్ విద్యార్థులు దత్తత తీసుకుంటారు. గ్రూపు స్టడీస్, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఇళ్లవద్ద విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకుంటారు.

బాధ్యతగా గుర్తించాలి



ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణతను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బాధ్యతగా గుర్తించాలి. ప్రభుత్వం అన్ని వసతులు కల్పించింది. అనంత సంకల్పం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి, వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలి. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించబోం.

– సాయిరాం, జిల్లా విద్యాశాఖ అధికారి

ఫలితాలు ఆశాజనకం



గత ఏడాది డిసెంబరు 14 న ప్రారంభమైన 'అనంత సంకల్పం' కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. పదో తరగతి విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నాం. ఇందులో భాగంగా వారికి నిర్వహిస్తున్న రౌండ్ పరీక్షల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించడమే 'అనంత సంకల్పం' లక్ష్యం.

– లోకేశ్వరరెడ్డి, డీసీఈబీ కార్యదర్శి

ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 8న ఆలయం ముందు టెంకాయలు అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు రాజగోపురం ముందు భాగంలో షాపునెం.1లో టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు ఒక సంవత్సరం హక్కు కోసం డిపాజిట్ రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. అలాగే షాపు నెం.2 (ఉట్టిలో) టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు ఒక సంవత్సరం హక్కు కోసం , వాహనాల పార్కింగ్ రుసుము వసూలు చేసుకునే హక్కు కోసం డిపాజిట్ రూ.3 లక్షలు చెల్లించాలని తెలిపారు. అలాగే పడమర రాజగోపురం ముందు భాగంలో టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకొనే హక్కు కోసం, తూర్పు రాజగోపురం ముందుభాగంలో భక్తుల పాదరక్షలు భద్రపరచుకునే హక్కుకు రూ. లక్ష డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. సీడీలు, క్యాసెట్లు అమ్ముకునే హక్కుకు, ధ్వజస్తంభం వద్ద కొబ్బరి చిప్పలు సేకరించడానికి రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలని సూచించారు. పడమర రాజగోపురం ముందు భాగంలో భక్తుల పాదరక్షలు భద్రపరిచే హక్కు కోసం రూ. 50 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాల్గొనాలన్నారు. ఉత్సవాలకు పూలు, తోమాలలు, గుండుమాలలు పంపిణీ చేసేందుకు , స్వామివారి అభిషేకానికి పాలు, పెరుగు, అన్నదానానికి ఇస్తరాకులు సప్లయ్ చేసేందుకు సీల్డ్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. టెండర్‌దారులు ఈ నెల 8లోపు టెండర్ వేయాలన్నారు.

ఎంబీబీఎస్ సీటు... రూ.19 లక్షలకు పోటు

బొమ్మనహాళ్: ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.లక్షలు కాజేసిన సైబర్ నేరగాడి ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్‌కు చెందిన కాళిదాసురాజు కుమారుడు చరణ్‌రాజ్ ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజుల క్రితం కాళిదాసురాజు సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియన వ్యక్తి ఫోన్ చేసి, తాను బెంగళూరు నుంచి ఫోన్ చేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. చరణ్‌రాజ్‌కు ఎంబీబీఎస్ సీటు వచ్చేలా చేస్తామని ఇందుకు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. అవతలి వ్యక్తి మాయలో చిక్కుకున్న కాళిదాసురాజు తన కుమారుడికి ఎంబీబీఎస్ సీటు దక్కుతుందన్న ఆశతో విడతల వారీగా రూ.50 వేలు మొదలు రూ.లక్ష చొప్పున రూ.19.24 లక్షలు ఫోన్‌పే ద్వారా సైబర్ నేరగాడి ఫోన్‌పేకు బదిలీ చేశాడు. అనంతరం ఇదే విషయాన్ని బంధువులకు తెలపడంతో వారు అప్రమత్తం చేయడంతో ఆగంతకుడి ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ అంటూ సమాధానం రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

ఎమ్మెల్సీ బరి... పోటీ పెరిగింది మరీ

- 2017లో 35 మంది
- ప్రస్తుతం 61 మంది



నాడు... నేడు ఓటర్ల సంఖ్య ఇలా..

ఏడాది	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
2017	2,49,582	20,515
2023	3,30,124	28,148

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజవకర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం అభ్యర్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2017 ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 35 మంది అభ్యర్థులు పోటీ పడగా... ప్రస్తుతం ఈ సంఖ్య 61కి చేరుకుంది. ప్రధానంగా పట్టభద్ర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య రెండింతలు కావడం గమనార్హం. ఓటర్ల విషయంలోనూ గతంలో కంటే 80,542 మంది పట్టభద్రులు, 7,633 మంది ఉపాధ్యాయులు పెరిగారు.

పట్టభద్రులకు భారీ డిమాండ్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి 2017లో జరిగిన ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అలాగే ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10 మంది బరిలో నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో పట్టభద్రుల నియోజవర్గం నుంచి 49 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి 12 మంది బరిలో ఉన్నారు. గతంతో పోల్చుకుంటే ఓటర్లు సైతం భారీగా పెరిగారు. 2017 ఎన్నికల్లో 2,48,582 పట్టభద్రులుండగా... వీరిలో 1,72,964 మంది పురుషులు, 76,618 మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం మొత్తం ఓటర్లు 3,30,124 కాగా, వీరిలో 2,22,340 మంది పురుషులు, 1,07,751 మంది మహిళలు, 33 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ప్రస్తుత ఎన్నికల్లో 80,542 మంది ఓటర్లు పెరిగారు.

- 2017లో 20,515 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా... వీరిలో 13,306 మంది పురుషులు, 7,209 మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య 28,148కు చేరుకోగా... ఇందులో 17,247 మంది పురుషులు, 10,899 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. గతంలో పోల్చుకుంటే ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో 7,633 మంది ఉపాధ్యాయ ఓటర్లు పెరిగారు.
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,49,582 మంది పట్టభద్రులకు గాను 1,55,536 (62.32 శాతం) మంది ఓటు హక్కువినియోగించుకున్నారు. అలాగే 20,515 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 18,739 (93.84 శాతం) మంది ఓటు వేశారు.

ఇద్దరి దుర్మరణం


కొలన్న, రమేష్ మృతదేహాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన కొలన్న (40), కర్ణాటకలోని మాస్‌పల్లి నివాసి రమేష్ (42) గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై మాస్‌పల్లి నుంచి రాయదుర్గానికి బయలుదేరారు. డి.హీరేహాళ్ మండలం బాదనహాళ్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే తగులబడుతున్న కంప చెట్ల నుంచి వెలువడిన పొగ మొత్తం రోడ్డును కమ్మేసింది. పొగను దాటుకుని ఆవలకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జైంది. కొలన్న, రమేష్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: మేలిమి బంగారం పేరుతో నకిలీ నాణేలు అంటగట్టి మోసం చేసిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం తాడిపత్రి పట్టణ ఎస్‌ఐ ధరణీబాబు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 7న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన సుజాత, రంజిత్, విక్రమ్... తాడిపత్రిలోని సంజీవనగర్ గోకుల్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఎల్.నరసింహులు, శ్రీదేవి దంపతులను కలిశారు. తమ వద్ద రూ. 5లక్షలు విలువ చేసే పురాతన మహిమ గల బంగారు నాణేలున్నాయని వాటిని తీసుకుంటే అంతా మంచే జరుగుతుందని నమ్మించారు. వారి మాయలో పడిన నరసింహులు దంపతులు.. తమ వద్ద రూ.4 లక్షలు ఉన్నాయని చెప్పడంతో కాసేపు బేరమాడి ఆ మొత్తాన్ని తీసుకుని కొన్ని నాణేలు ఇచ్చి గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించారు. అనంతరం తాము కొనుగోలు చేసిన బంగారు నాణేలను స్థానిక ఓ నగల వర్తకుడి వద్ద చూపించారు. అవి నకిలీ బంగారంగా వర్తకుడు ధ్రువీకరించడంతో తాము మోసపోయినట్లుగా గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి పక్కా ఆధారాలతో సుజాత, రంజిత్, విక్రమ్‌ను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులపై చీటింగ్ కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా లంకాదహనం


అశ్వవాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అశ్వవాహనంపై భక్తులకు చంద్రమౌళీశ్వరస్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లంకాదహనం కార్యక్రమాన్ని గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, సిబ్బంది శంకర్, నారాయణస్వామి, గోపి, మధు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి


ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- ఓటర్లను అభ్యర్థించిన మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని ఉపాధ్యాయులను మంత్రి ఉషశ్రీచరణ్ అభ్యర్థించారు. గురువారం కంబదూరులో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసన మండలి అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి తరపున ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులతో పాటు, జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను, స్థానిక పట్టభద్రులను రాష్ట్ర ప్రభుత్వ సాధనలపై చైతన్య పరుస్తూ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమి డైరెక్టర్ బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిందు, నీలి శంకరప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మీసేవ కుమార్, మల్లారి వెంకటేశులు, ఫయాజ్, దాదు, మల్లేష్, విల్సన్, రామస్వామి, కిరణ్, పవన్, ఒంటారెడ్డిపల్లి శీన, వెంకటేశులు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


పూజారి పోతులయ్య (ఫైల్)

రాప్తాడు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం గంగలకుంటకు చెందిన కపాడం పోతులయ్య(52)కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవల పెళ్లి చేశారు. వ్యవసాయంతో పాటు గ్రామంలోని సంగాలప్ప స్వామి ఆలయ పూజారిగా జీవనం సాగిస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాల పొలంలో జామ సాగు చేస్తున్న పోతులయ్య... గురువారం ఉదయం 6 గంటలకు చెట్లకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో స్విచ్ నొక్కగానే షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు, కుటుంబసభ్యులు హుటాహుటిన ఆయనను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పోతులయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, పోతులయ్య మృతితో గంగలకుంట గ్రామం శోకసంద్రమైంది. ఇటీవల సంగాలప్ప స్వామి కాపులు, దాతల సహకారంతో రూ.కోటి వెచ్చించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు. ఈ నెల 9, 10 తేదీల్లో ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి సుముహూర్తం నిర్ణయించి.. ఆ దిశగా పనులు వేగవంతం చేశారు. ఇంతలో పూజారి పోతులయ్య మృతి చెందడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

వాహనం ఢీకొని యువకుడు...


అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఇందిరానగర్ నివాసి చాకలి రాజు (33), రాము బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు రుద్రంపేటలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వీరిని డీమార్ట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం దూసుకెళ్లడంతో రాము ఎడమకాలు శరీరం నుంచి వేరుపడింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు కేసు దర్యాప్తు చేపట్టిన ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రాజ్

గుంతకల్లు: ఐటీసీలో పనిచేసే ప్రతి కార్మికుడికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఐటీసీఎల్ సౌత్ రీజనల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని నక్కనదొడ్డి సమీపంలో ఉన్న ఐటీసీ డిపోలో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనకు ఏకతాటిపై రావాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో ఐటీసీ లాభాలబాటలో నడిపించే బాధ్యతను విస్మరించరాదన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు సుధాకర్, విజయ్‌కుమార్, జీఆర్‌కే రెడ్డి, ఐటీసీ లైజనర్ జీఎస్ నజీర్, నాయకులు రామయ్య, రహంతుల్లా, కుమార్, కరీంఖాన్ పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


మద్దిలేటి (ఫైల్)

పెద్దపప్పూరు: అనారోగ్య పరిస్థితులను తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన మద్దిలేటి (51)కి భార్య రాములమ్మ, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మద్దిలేటి... పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన.. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

బెళుగుప్ప: మండలంలోని విరుపాపల్లి క్రాస్ వద్ద వారం రోజుల క్రితం పోలీసులమని చెప్పి మొక్కజొన్న వ్యాపారిని దోపిడీ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ రామకృష్ణయ్య వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలు కోసం వెళుతున్న వ్యాపారిని గుంతకల్లుకు చెందిన అలీఅబ్బాస్, ఇర్ఫాన్ విరుపాపల్లి క్రాస్ వద్ద అడ్డుకుని రూ.37వేలు దోచుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు వేగవంతం చేసి పక్కా ఆధారాలతో గురువారం అలీ అబ్బాస్‌ను రామసాగరం క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుడి నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితులపై ఇదివరకే యాడికి, తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

బీ సూపరింటెండెంట్‌కు సన్మానం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో బీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును 14వ బెటాలియన్‌కు బదిలీ చేశారు. గురువారం ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి చేతులు మీదుగా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, గోపి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో 2023–24కు సంబంధించిన బడ్జెట్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొనున్నారు.

మలేబిలేసుడికి అభిషేకం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరుకొండపై వెలసిన మలేబిలేసు లక్ష్మీనరసింహస్వామికి అభిషేక పూజలు గురువారం జరిగాయి. స్వామికి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు అందించారు. అనంతరం ధ్వజారోహణ, కలశస్థాపన, కళశారాధన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సింగమనేని వర్ధంతి సభ వాయిదా

అనంతపురం కల్చరల్: ఈనెల 5న ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించాల్సి ఉన్న సింగమనేని స్మారకోపన్యాస సభ అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని సింగమనేని స్మారక కమిటీ ప్రతినిధులు ఎస్ఎం బాషా, డాక్టర్ ప్రగతి ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ సభ జరిగే తేదీలు త్వరలో ప్రకటిస్తామన్నారు. సాహిత్య అభిమానులు సహకరించాలని కోరారు.

చిన్నారులకు కంటి పరీక్షలు



చిన్నారులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో త్వరిత చికిత్స కేంద్రం (డీఈఐసీ)లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు కంటి పరీక్షలు చేశారు. స్థానిక డీఈఐసీ కేంద్రంలో రాజమండ్రికి చెందిన గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో బరువు తక్కువగా పుట్టిన, నెలలు నిండక పుట్టిన, గుండె లోపం, రక్తహీనత, ఇతర వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులను సమీకరించి కంటి రెటీనా పరీక్షలను 'రెడ్ కాం' పరికరంతో 23 మంది చిన్నారులకు స్క్రీనింగ్ చేశారు. వారిలో 14 మంది చిన్నారులకు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామి, డాక్టర్ శ్రీవిద్య, కంటి పరీక్ష నిపుణురాలు జ్ఞాన ప్రసన్న, మేనేజర్ రజిత, స్టాఫ్ నర్సు సుష్మా, దివ్య తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి మహాసభలు

రాప్తాడురూరల్: అఖిలభారత రైతు వ్యవసాయ కూలీ సంఘం (ఏఐకేకేఎంఎస్) 3వ అఖిల భారత మహాసభలు ఈనెల 11 నుంచి 14 వరకు జరుగుతాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి ముత్యాలు ఓ ప్రకటనలో తెలిపారు. 11న అంతర్జాతీయ సెమినార్ హౌరాలో, 12 నుంచి 14 వరకు మహాసభల ప్రతినిధుల సమావేశాలు పశ్చిమబెంగాల్ దక్షిణ 24 పరగణాల జిల్లా జయనగర్‌లో జరుతాయన్నారు.

గాలికుంటు టీకా

ఆత్మకూరు: పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం గాలికుంటు టీకాలు వేయిస్తున్నట్లు పశువైద్యాధికారి తుల సీరాం తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా ఆవులకు, ఎనుములకు ముందస్తు గాలికుంటు టీకాలు వేశారు. ఈ నెల 31 వరకు గాలికుంటు టీకా వేయిస్తున్నట్లు తెలిపారు.

మామిడి చెట్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన మామిడి తోట

రాప్తాడు: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి మామిడి తోట దగ్ధమైంది. వివరాలు.. రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందని తలారి నారాయణకు రాప్తాడు చెరువు ఎగువన 3 ఎకరాల పొలం ఉంది. ఇందులో 300 మామిడి చెట్లను పెంచుతున్నాడు. మరో పది రోజుల్లో కాయలు కోసి మార్కెట్‌కు తరలించేందుకు రైతు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు పక్కన బీడు పొలంలో ఎండు గడ్డికి నిప్పు రాజేయడంతో మంటలు తోటను చుట్టుముట్టాయి. ఘటనలో 50 చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. దాదాపు రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.



మండుటెండలో వ్యాపారానికి వెళ్తున్న మహిళ



చున్నీలు ధరించి వెళ్తున్న మహిళలు



వేసవి తాపానికి ఎళ్లీరు



పండ్లు పాడవకుండా తోపుడు బండ్లపై కవర్లు, బెడ్‌షీట్లు కప్పుతున్న చిరువ్యాపారులు



మండుటెండలో శ్రమజీవి కష్టాలు

సన్‌స్ట్రోక్ స్టార్ట్

మార్చి నెల మొదలైంది. అప్పుడు సూరీడు సుర్రుమంటున్నాడు. మిట్ట మధ్యాహ్నం కాకనే ఉదయమే ఇంట్లో ఉంటే ఉక్కపోత..వీధుల్లోకొస్తే ఎండవేడిమితో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పాదచారులు సరే.. చిరువ్యాపారులు ఎండలోనే రోజంతా ఉంటూ మాడిపోతున్నారు. పాదచారులు గొడుగు కిందనో, గోడ నీడలోనో సేదతీరుతున్నారు. వాహనదారులు స్కార్ఫ్ కట్టుకుని, తలపాగా చుట్టుకొని, టోపీ ధరించి వెళ్లాల్సి వస్తోంది. మండే ఎండలో ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. మరోవైపు కొబ్బరిబోండాంలు, కర్బూజ, కళింగర పండ్లు కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

● ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి

అనంతపురం క్రైం: రానున్న సాధారణ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డిని ఆదేశించారు. ఇటీవల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి యువత, పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను గజమాల, శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు తక్కువ కాలవ్యవధి ఉందని, సచివాలయాలు విభజించి, ప్రతి ఓటరునూ కలిసి ప్రభుత్వం చేసిన మేలు వివరించాలన్నారు. గతంలో టీడీపీతో మోసపోయిన విషయాలను గుర్తు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల కాలంలో ఎంత అభివృద్ధి చేసిందో కళ్లకు కట్టినట్లు తెలియజేసి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే అనంతతో పాటు తన ఎంపికకు సహకరించిన యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి, మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఎంపీటీసీ నాగేంద్ర, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, నాగిరెడ్డిపల్లి రామసుబ్బారెడ్డి, జాఫర్, అబ్దుల్, ఓబులేసు, యువరాజ్, బీ సుబ్బారెడ్డి, బాబావలి, మాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి



నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రచారం చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు



25వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు

● అహుడా చైర్మన్ మహాలక్ష్మి, మేయర్ వసీం పిలుపు

అనంతపురం క్రైం: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య వేర్వేరుగా గురువారం ప్రచారం చేశారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య నగరపాలక సంస్థలోని మెయిన్‌హాల్‌తో పాటు వివిధ విభాగాల అధికారుల చాంబర్ వద్దకు వెళ్లి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు అబుసలేహా, సంపంగి రామాంజనేయులు, బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ కథ ముగిసింది:

నగరంలోని 25వ డివిజన్‌లోని ఓటర్ల వద్దకు అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ వెళ్లి ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులు వెన్నపూస రవీంద్రా రెడ్డి, రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేధావులు, విద్యావంతులు గతంలో టీడీపీ చేసిన దుర్మార్గాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత టీడీపీ దౌర్జన్య పాలన, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సుపరిపాలనపై ఓటర్లకు తెలియజేశారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణను ఓర్వలేక టీడీపీ కుట్రలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. వారెన్ని కుట్రలు చేసిన టీడీపీ కథ ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సతీమణి హరిత, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, నాయకులు చలపతి, వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ' సేవలు మెరుగుపర్చండి

● సీఎంకు లేఖ రాసిన ప్రజారోగ్య వేదిక



సీఎం వైఎస్ జగన్‌కు రాసిన లేఖను ఎమ్మెల్యే అనంతకు అందిస్తున్న ప్రజారోగ్య వేదిక నాయకులు

అనంతపురం క్రైం: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సేవలు మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని, అందులో మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలని ప్రజారోగ్య వేదిక నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. గురువారం ఆ లేఖను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఆయన నివాసంలో అందించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక బడ్జెట్‌తో పాటు పూర్తిస్థాయిలో పాలనాయంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. ఈ నెలలో బడ్జెట్ సమర్పణకు గడువు ఉన్నందున ఈ డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిశీలించాలన్నారు. క్యాజువాలిటీ ఓపీని ఏర్పాటు చేసి అన్ని స్పెషలిస్టులను అందుబాటులోకి తేవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వం ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటికే కొన్ని విభాగాల్లో అత్యుత్తమ సేవలందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కే కొండయ్య, కార్యదర్శి పీ శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పీ ప్రసూన, నాయకులు ఏజీ రాజమోహన్ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గాండ్లపర్తిలో వైఎస్సార్ జలకళ ద్వారా వేసిన బోరు బావిలో నీరు బయటకు వస్తున్న దృశ్యం

రాప్తాడు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశ పెట్టిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డొక్కా రామచంద్ర పేర్కొన్నారు. గాండ్లపర్తి గ్రామంలో వైఎస్సార్ జలకళ ద్వారా రైతులకు ఉచిత బోరు బావులు తవ్విస్తున్నారు. గురువారం గ్రామంలో గోపాల్ రెడ్డి రైతు పొలంలో బోరుబావి తవ్వించగా, 100 అడుగుల్లో 3 ఇంచుల నీరుపడింది. డొక్కా రామచంద్ర మాట్లాడుతూ రైతులు పడుతున్న కష్టాలను కళ్లారా చూసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రైతుల కష్టాలను తీర్చేందుకు గతంలో సొంత డబ్బులతో బోర్లు వేయించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ దృష్టికి తీసుకుపోగా వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా బోర్లు వేపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డొక్కా చిన్న రామలింగమయ్య, చిట్రా ఓబులేష్, గోపాల్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, గంగాధర్ రెడ్డి, విజయశంకర్, నల్ల గోపాల్, విజయ్, ఈశ్వరయ్య, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యసేవలే లక్ష్యం



ఆర్డీటీకి ఐసీఐసీఐ ఫౌండేషన్ అందించిన అంబులెన్స్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని 88 గ్రామాల్లో వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి పేర్కొన్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ అందించిన అంబులెన్స్‌తో గ్రామాల్లో వైద్య సేవలు అందించేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆర్డీటీ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చెంచు కుటుంబాలకు వైద్య సదుపాయం కల్పించేందుకు రూ.29 లక్షలతో అంబులెన్స్ తెచ్చారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ జోనల్ హెడ్ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్డీటీ ఏజెన్సీ ప్రాంతాల్లో చేస్తున్న సహాయం చేసేందుకు తమ వంతుగా అంబులెన్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఐసీఐసీఐ జోనల్ హెడ్ హరేష్‌బాబు, ప్రాజెక్టు మేనేజర్ శిరీష, రీజినల్ హెడ్ మొహమ్మద్ అలి సయ్యద్, రీటైల్ హెడ్ వీరాస్వామి, బ్రాంచ్ మేనేజర్ సురేష్‌కుమార్, ఆర్డీటీ డైరెక్టర్ సాగర్‌మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

రాప్తాడు: బాల్యవివాహాలతో అనర్థాలు అధికమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావణి తెలిపారు. గురువారం మండలంలోని పంగల్ రోడ్డులోని కేజీబీవీలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికలను రక్షించు-బాలికలను చదివించు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల ప్రసవం సమయంలో సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువన్నారు. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, గృహ హింసలు, స్త్రీలపై అత్యాచారాలు, బాల్య వివాహాలు, శారీరక, మానసిక, సాంఘిక హింసలపై వివరించారు. మహిళలు దిశ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అరుణమ్మ, ఎస్ఓ ముత్యాలమ్మ, ఏఎన్ఎం అనిత, మహిళ పోలీసులు షాజియా, రాజేశ్వరి, కేజీబీవీ హెల్త్‌అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై నేడు అవగాహన

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై శుక్రవారం ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. గురువారం ఆయన బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు జరగనున్న అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునే ఓటర్లు అందరూ హాజరై ఓటింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్లను చైతన్య పరిచేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని ఎంపీడీ విజయ్‌ప్రసాద్ గురువారం తెలిపారు.

రాప్తాడురూరల్: పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై శుక్రవారం అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పట్టభద్రులై ఓటరుగా నమోదు చేసుకున్న సచివాలయాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు హాజరుకావాలన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా



తపాలా శాఖ ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించిన జీడీఎస్ ఉద్యోగులు

అనంతపురం సిటీ: స్థానిక తపాలా శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. యూనియన్ డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య మాట్లాడారు. జీడీఎస్ కమిటీ సిఫార్సు చేసిన డిమాండ్లు అమలు చేయాలని కోరారు. గడచిన నవంబర్ 14న న్యూఢిల్లీలో ధర్నా సందర్భంగా రాతమూలకంగా ఇచ్చిన హామీలన్నీ ఉన్నతాధికారులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలు మానుకోకపోతే గుణపాఠం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ ప్రతినిధులు చాందు సాబ్, సూర్యనారాయణ రెడ్డి, కేశవరావు, రామ్మూర్తి, బాబు, సీతారాములు, ఆరోగ్యప్ప, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి కొల్లాగయ్య ఉత్సవాలు

శింగనమల: నాయనవారిపల్లి గ్రామంలో ఈనెల 6 నుంచి కొల్లాగయ్య, గంపమల్లయ్య స్వామి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు వడ్ల రంగస్వామి తెలిపారు. కొల్లాగయ్య స్వామి 365 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నామన్నారు. 6, 7 తేదీల్లో స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే 8వ తేదీ రాత్రి గ్రామంలో స్వాములను ఊరేగిస్తామన్నారు. అదే రోజు రాత్రి కడవ పూజ, భజనలు ఉంటాయని పేర్కొన్నారు.

7 నుంచి గ్రామీణ పోటీలు : ఉత్సవాల్లో భాగంగా 7వ తేదీ మోటారు సైకిల్ స్లో పందెం, ట్రాక్టర్ రివర్స్ పందెం నిర్వహిస్తామని, తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఉట్ల పందెం ఉంటుందని, తొలి ఇద్దరు విజేతలకు నగదు బహుమతి అందిస్తామన్నారు.

8న రాతిదూలం లాగుడు పోటీలు : ఉదయం 8గంటలకు రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి బహుమతి రూ.60,116ను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి , ఆలూరు సాంబశివారెడ్డి, ద్వితీయ బహుమతిని రూ. 50,116ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, తృతీయ బహుమతి రూ.40,116, ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ చాములూరు హరిత, నాలుగో బహుమతి రూ. 30,116 వెంకటరమణ, ఐదో బహుమతి రూ. 20,116 మనోజ్‌రెడ్డి, ఆరో బహుమతి రూ.10,116 సాకే నాగేంద్ర, ఏడో బహుమతి రూ.6,116 డీలరు ఆదినారాయణ అందిస్తారని నిర్వాహకులు తెలిపారు.

గ్యాస్ ధరలతో పేదలపై భారం



శ్రీకంఠం సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ ధరను పెంచి పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక శ్రీ కంఠం సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్‌పై పెంచిన ధర ఉపసంహరించాలని సీపీఎం ఒకటో కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన తెలియజేశారు. నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్లకు రూ.వేల కోట్లు రాయితీలిస్తూ పేదలపై ధరల భారం మోపడం కేంద్ర ప్రభుత్వానికి అనవాయితీగా మారిందన్నారు. గ్యాస్‌పై సబ్సిడీకి కేంద్ర ప్రభుత్వం మంగళం పాడిందని, సిలిండర్‌పై రూ.50 పెంచడంతో మరింత భారం మోపిందన్నారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1,170కి చేరిందన్నారు. వాణిజ్య సిలిండర్‌పై రూ.350 పెంచడంతో తోడుపు బండ్లపై హోటళ్లు, టీస్టాళ్లు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న వారిపై భారం మోపడమే అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, వలి, మసూద్, వెంకటనారాయణ పాల్గొన్నారు.